
సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం ׀ 1 ׀ అక్టోబర్ ׀ 2025



బ్రహ్మోత్సవాలకు వేళాయె

ద్వారకామహర్షి తపోఫలితం.. శ్రీవారి దివ్య క్షేత్రం. మహర్షి తపస్సుకు మెచ్చిన శ్రీవేంకటేశ్వరస్వామి స్వయంభూ ఈ క్షేత్రంలో వుట్టలో వెలిశారు. IIలో ▸



'పెరటి'లో ఆఫ్రికా 'రక్కసి'

పెరటి తోటల రైతులను ఆఫ్రికా నత్తలు వణికిస్తున్నాయి. విశాఖ, మన్యం జిల్లా రైతులను కలవరానికి గురిచేసి.. ఉమ్మడి జిల్లాలోని కొన్ని ప్రాంతాలపై దాడి చేశాయి. IIలో ▸



హత్యగా మారిన మిస్సింగ్ కేసు ?

తణుకులో సంచలనం రేకెత్తించిన యువకుడి అదృశ్యం కేసు కాస్త హత్య కేసుగా మలుపు తిరిగింది. వివాహేతర సంబంధం కారణంగా తెలుస్తోంది. IIలో ▸

ఇరిగేషన్ భూముల స్వాహా

- కైకలూరులో రూ.కోట్ల విలువైన భూముల కబ్జాపై నోరెత్తని అధికారులు
- హెచ్చరిక బోర్డులు పెట్టినా లెక్క చేయని వైనం
- కూటమి పాలనలో పేట్రేగిపోతున్న భూ దందా

సాక్షి, టాస్క్‌ఫోర్స్: కై కలూరులో కబ్జాల పర్వం యథేచ్ఛగా కొనసాగుతోంది. కూటమి పాలనలో ప్రభుత్వ భూములకు రక్షణ కరువైంది. రూ.కోట్ల విలువైన ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, పుంత పోరంబోకు భూములను పట్టపగలు ఆక్రమించేస్తున్నారు. జిల్లా అధికారులకు పదేపదే ఫిర్యాదులు చేస్తున్న చర్యలు శూన్యం. జాతీయ రహదారుల పక్కనే ప్రభుత్వ భూముల్లో షాపింగ్ కాంప్లెక్సు కట్టి ఏకంగా అద్దెలకు ఇస్తున్నారు. అధికారం మాది.. అడిగేవాడెవడురా? అంటూ అధికారులపై అరుస్తున్నారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా కై కలూరు నియోజక వర్గం ఏలూరు జిల్లాలో చేరింది. దీంతో మా పరిధి కాదంటే.. మాది కాదంటూ అధికారులు కావాలని ఆక్రమణ ఫిర్యాదులను పట్టించుకోవడం లేదు.

ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ అధికారులు ఆక్రమణలపై నోరెత్తలేని పరిస్థితి నియోజకవర్గంలో కనిపిస్తోంది. డ్రెయిన్లు, కాల్వలకు మరమ్మత్తులు చేస్తున్నామని ఒక పక్కన గొప్పలు చెబుతూనే మరోవైపు ఆక్రమణల పర్వాన్ని కొందరు నాయకులు ప్రోత్సహిస్తున్నారు. ఎన్నికల్లో విజయానికి కృషి చేశాం.. ఎంతో డబ్బు ఖర్చుచేశాం.. ఆ మాత్రం ఆక్రమణలు చేస్తే తప్పేంటి..! అనే ధోరణి అక్రమార్కులలో స్పష్టంగా బయటపడుతోంది. ఆక్రమణల స్థలాల్లో అధికారులు హెచ్చరిక బోర్డులు పెడితే గంటల వ్యవధిలో అవి మాయమవుతున్నాయి. రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారు. ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోకపోతే మరిన్ని ఆక్రమించడం ఖాయం కనిపిస్తోంది.



మండవల్లి మండలం భైరవపట్నంలో జాతీయ రహదారి పక్కన ఇరిగేషన్ స్థలంలో కట్టిన దుకాణాల సముదాయం



మండవల్లి మండలం భైరవపట్నంలో ఆక్రమణల వద్ద హెచ్చరిక బోర్డులు పెట్టిన ఇరిగేషన్ ఏఈ



మండవల్లి మండలం భైరవపట్నంలో హెచ్చరిక బోర్డులు పెట్టిన ఇరిగేషన్ సిబ్బంది



ఇరిగేషన్ భూమిలో అనుమతులు లేకుండా నిర్మించిన బోదె

రూ. కోట్ల విలువైన ఇరిగేషన్ భూముల కబ్జా

పామర్రు–దిగమర్రు జాతీయ రహదారి 216లో మండవల్లి మండలం పాత భైరవపట్నం శోభనాద్రిపురం రోడ్డు పక్కన సర్వే నంబరు 36లో సుమారు 60 సెంట్ల ఇరిగేషన్ భూమిని ఆక్రమించారు. ఏకంగా 12 దుకాణ సముదాయాలను నిర్మించారు. ఈ దుకాణాల ద్వారా ఆక్రమణదారుడికి నెలకు రూ.2 లక్షల పైనే ఆదాయం వస్తుంది. ఆక్రమణలపై సెప్టెంబరు 15న ఏలూరు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. పంచాయతీ నోటీసులు అందించింది. కరెంటు సర్వీసును సైతం కట్ చేశారు. ఇరిగేషన్ అధికారులు హెచ్చరిక బోర్డులు పెట్టారు. అయినా నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఆత్మగా భావించే నాయకుడు కొమ్ముకాస్తున్నాడు. కైకలూరు – కోరుకొల్లు దారిలో 30 సెంట్ల ఇరిగేషన్ భూమిని ఆక్రమించారు. కైకలూరు – ఏలూరు రోడ్‌లో ఆర్ అండ్‌బీ రోడ్డు పక్కన షాపింగ్ కాంప్లెక్స్ కట్టారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఈ లిస్టు చాంతాడంత ఉంది.

ఆక్రమణలు తొలగిస్తాం



ఆక్రమణదారులకు నోటీసులు పంపుతున్నాం. అయినా లెక్క చేయడం లేదు. బోర్డులు పెడుతున్నా పీకేస్తోన్నారు. ఇరిగేషన్ ఈఈ త్వరలో ఆక్రమణల భూములను పరిశీలిస్తారు. అక్రమ కట్టడాలపై తగు చర్యలు తీసుకుంటాం.

– ఎం.శిరీష, ఇరిగేషన్ సబ్ డివిజన్ డీఈ, కైకలూరు

న్యూస్‌రీల్

సమస్యల పరిష్కారం కోసం చలో విజయవాడ



భీమవరంలో చలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘం నేతలు

భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచిపోతున్నా నేటికీ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేదని రాష్ట్ర ఫ్యాప్టో చైర్మన్ ఎల్.సాయి శ్రీనివాస్ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల విద్యా, ఆర్థిక రంగ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ఫ్యాప్టో పోరుబాట కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 7న 'చలో విజయవాడ'కు పిలుపునివ్వడంతో మంగళవారం భీమవరం యూటీఎఫ్ కార్యాలయంలో ఫ్యాప్టో జిల్లా చైర్మన్ పీఎస్.విజయరామరాజు, జనరల్ సెక్రటరీ జి.ప్రకాశం నేతృత్వంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. త్వరిత గతిన 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని, బకాయి ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి తప్పించి బోధనకు మాత్రమే పరిమితం చేయాలని, ఉపాధ్యాయులకు యాప్‌ల భారం నుంచి విముక్తి కలిగించాలన్నారు. అనంతరం చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

3 నుంచి ఇండక్షన్ ట్రైనింగ్

ఏలూరు(ఆర్‌ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మెగా డీఎస్సీ–2025లో ఎంపికైన నూతన ఉపాధ్యాయులకు ఇండక్షన్ ట్రైనింగ్ ఉంటుందని విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ అన్నారు. ఈ నెల 3 నుంచి 10 వరకు డీఎస్సీలో నూతనంగా ఎంపికై న ఉపాధ్యాయులు ఇండక్షన్ ట్రైనింగ్‌కు హాజరుకావాలన్నారు. ఈ ట్రైనింగ్ ఎవరికి ఏ విధమైన మినహాయింపులు ఉండవని, ట్రైనింగ్ క్యాంపునకు హాజరుకాని ఉపాధ్యాయులు తదుపరి విడతలో నిర్వహించే ట్రైనింగ్ హాజరైన తరువాత మాత్రమే పోస్టింగ్ ఆర్డర్ ఇస్తారన్నారు. ట్రైనింగ్‌కు అవసరమైన వస్తువులన్నీ తెచ్చుకోవాలన్నారు. ట్రైనింగ్‌కు హాజరయ్యే నూతన ఉపాధ్యాయుల వారి బెడ్‌షీట్స్, ఇతర వ్యక్తిగత సామగ్రి, ఉదయం జాగింగ్ నిమిత్తం రన్నింగ్ షూస్, ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్స్ తప్పనిసరిగా తెచ్చుకోవాలన్నారు.

రోడ్డు కోసం పాదయాత్ర



ఏలూరు రోడ్డు కోసం పాదయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: రోడ్డు నిర్మాణం కోసం ప్రజలు రోడ్డెక్కారు. జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు రోడ్డు నిర్మించాలని మంగళవారం పాదయాత్ర నిర్వహించారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే నుంచి రావికంపాడు వరకు ప్రధాన రహదారి గోతులతో అస్తవ్యస్తంగా ఉందన్నారు. ఎమ్మెల్యే గానీ ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోవడం లేదన్నారు. రోడ్డు దుస్థితిని చూపించే ఉద్దేశంతో పాదయాత్ర చేసినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర దాటినా రోడ్ల పరిస్థితిలో మార్పు లేదన్నారు. జంగారెడ్డిగూడెం – ఏలూరు రోడ్డు నెల రోజుల్లో నిర్మించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.

రోగిపై టెక్నీషియన్ దాడి



జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వీరరాఘవులు

జంగారెడ్డిగూడెం: పేషెంట్‌పై టెక్నీషియన్ దాడి చేసిన ఘటన జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో జరిగింది. రోగి బంధువులు, ఆసుపత్రి వర్గాల సమాచారం ప్రకారం.. తాడువాయి పంచాయతీ గొల్లగూడెంకు చెందిన ములకాల వీరరాఘవులు జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్నారు. మంగళవారం ఉదయం షిఫ్ట్‌లో డయాలసిస్ చేయించుకోవాల్సి ఉండగా, ఇంటి వద్ద పని ఉందని, మధ్యాహ్నం షిఫ్ట్‌కు వస్తానని డయాలసిస్ టెక్నీషియన్ సుధాకర్‌కు విషయం తెలిపారు. ఆయన కుదరదని చెప్పడంతో ఆసుపత్రికి వచ్చి డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఈ క్రమంలో కాలు తిమ్మిర్లు ఎక్కి వీరరాఘవులు కాలుపై కాలువేసుకుని పడుకున్నాడు. అక్కడకు వచ్చిన సుధాకర్ గమనించి వాగ్వాదానికి దిగాడు. మాటా మటా పెరగడంతో సుధాకర్ ట్రేతో వీరరాఘవులపై దాడి చేశాడు. దీంతో పేషెంట్ బంధువులు ఆసుపత్రిలో ఆందోళనకు దిగారు.

ఆశ్రం సెంటర్ పొదల్లో బాలిక



ఆశ్రం హాస్పిటల్ సెంటర్ ముళ్లపొదల్లో బాలిక

ఏలూరు టౌన్: ఏలూరు శివారు ఆశ్రం హాస్పిటల్ సెంటరు రైల్వే బ్రిడ్జి సమీపంలో ముళ్ళ పొదల్లో బాలికను వదిలేయడం కలకలం రేపింది. డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో వన్‌టౌన్ సీఐ జీ.సత్యనారాయణ, పెదవేగి సీఐ సీహెచ్ రాజశేఖర్, రూరల్ ఎస్సై నాగబాబు, పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బాలికను గుర్తు తెలియని వ్యక్తులు రైల్వే బ్రిడ్జి పక్కన పొదల్లో వదిలేసి వెళ్ళినట్లు ప్రాథమిక అంచనా. డీఎస్పీ మాట్లాడుతూ.. స్థానికుల సమాచారంతో హుటాహుటిన వెళ్ళి బాలికను వెంటనే ఆశ్రం హాస్పిటల్‌కు తరలించామన్నారు. బాలిక పుట్టుకతోనే మానసికంగా ఎదగని స్థితిలో, శారీరక అనారోగ్యంతో బాధపడుతుందని తెలిపారు. వివరాలు ఇంకా తెలియలేదని, పూర్తిస్థాయిలో విచారణ చేస్తామని చెప్పారు.

ప్రైవేటీకరణ వద్దే వద్దు

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయంపై వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నిరసన



నరసాపురంలో నిరసన ప్రదర్శన చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు

నరసాపురం: రాష్ట్రంలో వైద్యకళాశాలను ప్రైవేటు పరం చేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలో ఎస్సీ సెల్ చేపట్టిన నిరసన కార్యక్రమం నరసాపురంలో విజయవతంగా సాగింది. 30 యాక్ట్‌ను పోలీసులు అమలు చేసినా.. పార్టీ శ్రేణులు భారీ ర్యాలీతో నిరసన గళం వినిపించారు. పేదలు, మధ్య తరగతి వారికి వైద్య విద్యను దూరం చేసి వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేస్తే ఊరుకునేది లేదంటూ దళితులు కదం తొక్కారు. ప్రభుత్వం తీరుమారకుంటే రానున్న రోజుల్లో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ముందుగా పార్టీ ఎస్సీ సెల్ నాయకులు పార్టీ కార్యాలయం నుంచి పాదయాత్రగా భారీ నిరసన ర్యాలీ చేశారు. వైఎస్సార్‌సీపీ జెండాలు పట్టుకుని ట్యాక్సీ స్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం ఆటలు సాగనివ్వమని, వైద్య విద్యను ప్రైవేటీకరణ చేయనివ్వమని నినదించారు. ర్యాలీ అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమంలో పార్టీ కేంద్రపాలక మండలి సభ్యుడు పీడీ రాజు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 17 మెడికల్ కళాశాలల్లో కొన్నింటిలో తరగతులు కూడా ప్రారంభమయ్యాయన్నారు. పెండింగ్ పనులు పూర్తి చేసి, మెడికల్ కళాశాలలు నడిపించడం చేతకాని కూటమి ప్రభుత్వం అబద్ధాలు చెబుతుందన్నారు. మధ్య తరగతి ప్రజల ప్రయోజనాలను విస్మరించడం చంద్రబాబుకు కొత్తకాదన్నారు. పార్టీ యూత్ విభాగం రాష్ట్ర కార్యదర్శి గంటా రాహుల్ మాట్లాడుతూ వెంటనే 590 జీవో రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఒకప్పుడు రాజశేఖరరెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో వైద్య విద్యను పేద, మధ్య తరగతికి చిక్కేలా చేశారన్నారు. జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలనడం దారుణమన్నారు. పార్టీ ఆచంట నియోజకవర్గ పరిశీలకుడు ఖండవల్లి వాసు, నరసాపురం ఎంపీపీ మైలాబత్తుల సోనీ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ హయాంలో ఏర్పాటైన మెడికల్ కళాశాలల విషయంలో కూటమి ప్రభుత్వం అబద్ధపు ప్రచారాలు మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ యూత్ విభాగం జిల్లా అధ్యక్షుడు చిగురుపాటి సందీప్, కౌన్సిలర్లు జిల్లెళ్ల దిలీప్, సిర్రా కాంతమ్మ, పార్టీ ఎస్సీ సెల్ నరసాపురం నియోజకవర్గ అధ్యక్షుడు కోడెల్ల వెంకట్రావు, పార్టీ మేధావుల ఫోరం జిల్లా కన్వీనర్ వంగలపూడి జక్కరయ్య, పార్టీ ట్రేడ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎండీ షాన్‌వాజ్‌ఖాన్, ఎస్సీ సెల్ నాయకులు పడవల సత్యనారాయణ, కొల్లాబత్తుల రవికుమార్, కాకిలేటి ఆనంద్, వర్ధనపు చంటి, వర్ధనపు సుధాకర్, తణుకుల చంటి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రభుత్వ కుట్ర

పెనుమంట్ర: పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేందుకు చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తూ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయడానికి సిద్ధమవుతుందని పెనుమంట్ర జెడ్పీటీసీ కర్రి గౌరీ సుభాషిణి అన్నారు. మంగళవారం నియోజకవర్గ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో మార్టేరు సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. గౌరీ సుభాషిని మాట్లాడుతూ తక్షణం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పిల్లి రుద్ర ప్రసాద్ మాట్లాడుతూ కేవలం దళిత వర్గాలకు అన్యాయం చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం వ్యతిరేక విధానాలను ప్రారంభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మట్టకుమారి రాము, సుంకర సీతారాం, కోట వెంకటేశ్వరరావు, మండల పార్టీల అధ్యక్షులు గూడూరు దేవేంద్రుడు, జక్కశెట్టి సంటి, జక్కం శెట్టి శ్రీరామ్, మండలాల ఎస్సీ సెల్ అధ్యక్షులు పలివెల శ్రీనివాస్, బుర్ర రవికుమార్, గొట్టుముక్కల సునీల్ వర్మ, జి ఏసురత్నం, దుర్గాప్రసాద్ ,కోట గిరిధర్, వడ్లపాటి అంబేద్కర్, సాగర్ సుబ్రహ్మణ్యం, కొడమంచిలి రాజు తదితరులు పాల్గొన్నారు.



మార్టేరు సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కూటమి ప్రభుత్వంలో అవినీతి రాజ్యం

మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: రాష్ట్రం, నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వ అవినీతి పాలన అంతులేకుండా ఉందని మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ దుయ్యబట్టారు. మంగళవారం ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కొట్టు మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన 18 నెలల్లో రూ.2 లక్షల కోట్లు అప్పుచేసిన చంద్రబాబు ఆ సొమ్మును ఏం చేశాడో లెక్క చెప్పాలన్నారు. సూపర్ సిక్స్ సూపర్ ఫ్లాప్ అయిందని చెప్పారు. తల్లికి వందనం 87 లక్షల మంది విద్యార్థులకు అందచేయాల్సి ఉండగా కేవలం కొంతమందికే ఇచ్చారన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు ఇస్తామని గ్యాస్ కొట్టి వదిలారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో లిక్కర్ షాపులు నిర్వహిస్తే రూ.3,500 కోట్ల అవినీతి జరిగిందని చంద్రబాబు గోల చేసి, నిరూపించలేక నోరు మెదపకుండా ఉన్నాడన్నారు. ఏడాదికి 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి పథకాలు అమలు చేయలేని చేతకాని చంద్రబాబు హామీలు ఎందుకు ఇచ్చాడని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంటు, రైతులకు అన్నదాత సుఖీభవ పథకాలను అమలు చేయలేపోయిన అసమర్థ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నిలిచాడన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు తమ అవినీతి పాలనన బహిరంగంగానే చెబుతున్నారని కొట్టు ఎద్దేవా చేశారు. మట్టి, ఇసుక, పేకాట, కోడి పందేలు ఏడాది పొడవునా కొనసాగించడం వారికి చెల్లుతుందన్నారు. ఇసుక ఉచితం అంటూనే 6 యూనిట్లకు రూ.16,500 వసూలు చేస్తున్నారన్నారు. కోరుమిల్లి ఎంపీటీసిని మభ్యపెట్టి తమ పార్టీలో చేర్చుకొని అభివృద్ధి జరగలేదని చెప్పడం హాస్యాస్పదమన్నారు. తాను చేసిన అభివృద్ధిని చూపిస్తానని, ప్రస్తుత ఎమ్మెల్యే చేసిన అభివృద్ధిని ప్రజలకు చూపించాలని చాలెంజ్ విసిరారు. నియోజకవర్గంలో రూ.200 కోట్లుతో మూడు బ్రిడ్జిలు నిర్మిస్తామని చెప్పిన ప్రజా ప్రతినిధి టెండర్లు పిలిచారా? నిధులు మంజూరు చేయించారా? నిర్మాణాలు ఎప్పుడు చేపడుతున్నారో చెప్పగలరా? అని ప్రశ్నించారు. గతంలో ఇదే ప్రజాప్రతినిధి మున్సిపల్ చైర్మన్‌గా ఎల్ఈడీ లైట్ల పేరుతో రూ.కోట్లు దండుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు క్రీడల పేరుతో దోపిడీ చేస్తున్నారన్నారు.

గోదావరి ఉగ్రరూపం



కనకాయలంకలో పడవలపై కాజ్ వే దాటుతున్న గ్రామస్తులు

యలమంచిలి: గోదావరి ఉగ్రరూపం దాల్చింది. దీంతో కనకాయలంక కాజ్ వే పై సుమారు ఆరడుగుల మేర నీరు ప్రవహిస్తుంది. దీంతో ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. గోదావరిలో నీరు మరింత పెరుగుతుండడంతో మరో వారం రోజుల వరకు కాజ్‌వే వరద ముంపులోనే ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. వరద పెరిగితే మిగిలిన లంక గ్రామాలు కూడా వరద ముంపునకు గురయ్యే అవకాశం ఉన్నందున అధికారులందరూ విధులు నిర్వహణకు సిద్ధంగా ఉంచామని తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్ తెలిపారు. స్థానిక సిబ్బంది అప్రమతంగా ఉండాలన్నారు.

జిల్లా అభివృద్ధికి కృషి చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

భీమవరం (ప్రకాశంచౌక్): కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు ద్వారా పశ్చిమగోదావరి జిల్లా సమగ్ర అభివృద్ధికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశం కేంద్ర మంత్రి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, కలెక్టర్ చదలవాడ నాగరాణి, పీఏసీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బీ, ఆర్ డబ్ల్యుఎస్, వైద్య ఆరోగ్యశాఖ, వ్యవసాయ, ఉద్యాన శాఖ, పౌర సరఫరాలు తదితర శాఖల ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను దేశవ్యాప్తంగా అమలు చేస్తోందని వాటి ఫలాలు ప్రజలకు చేరాలంటే అధికారులు క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. భీమవరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భీమవరం యనమదుర్రు డ్రెయిన్‌పై అసంపూర్తిగా ఉన్న మూడు వంతెనలకు అప్రోచ్ రోడ్డు వేయాలని, అంచనా వేయగా రూ.36 కోట్లు ఖర్చవుతుందని తెలిపారు. తాడేపల్లిగూడెం, తణుకు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ గుంతలు పూడ్చడంతో ప్రయోజనం లేదని, సింగిల్ లేయర్ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న ప్రచార ప్రక్రియను మంత్రికి వివరించారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి బ్యాడ్మింటన్‌లో రన్నర్స్‌కు అభినందనలు


రన్నర్స్ కప్పులతో క్రీడాకారులు నవ్య, రాగ

తణుకు అర్బన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన సీబీఎస్ఈ బోర్డ్ 68వ నేషనల్ స్కూల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో తణుకు పట్టణానికి చెందిన పోతుల నవ్యగీతిక, తాడేపల్లిగూడెంకు చెందిన కొండ్రెడ్డి రాగ అండర్ 17 డబుల్స్ విభాగంలో రన్నర్స్‌గా నిలిచారు. పెంటపాడు మండలం అలంపురంలోని సరస్వతీ విద్యాలయ స్కూలులో 10వ తరగతి చదువుతున్న వీరు ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు కొయంబత్తూరులో నిర్వహించిన పోటీల్లో ఈ ఘనత సాధించినట్లు పోతుల నవ్యగీతిక తండ్రి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలువురు ప్రముఖులు అభినందించారు.

రాష్ట్ర బాస్కెట్‌బాల్ జట్టుకు క్రీడాకారుల ఎంపిక


ఎంపికైన క్రీడాకారులు కావ్యశ్రీ, ఇందుప్రియ

నూజివీడు: పట్టణానికి చెందిన ఎస్‌వీఎస్ కావ్యశ్రీ, డీ ఇందుప్రియ బాస్కెట్‌బాల్ ఏపీ జట్టుకు ఎంపికైనట్లు కోచ్ వాకా నాగరాజు మంగళవారం తెలిపారు. ఇటీవల చిత్తూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్–14 బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి కృష్ణాజిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. ఈ జట్టులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కావ్యశ్రీ, ఇందుప్రియలను సెలక్షన్ కమిటీ రాష్ట్ర జట్టులోకి ఎంపిక చేసింది. వీరు ఈనెల 4 నుంచి 10 వరకు డెహ్రాడూన్‌లో నిర్వహించే జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరుపున ఆడతారని కోచ్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులను, కోచ్‌ను పలువురు పీడీలు అభినందించారు.

మద్ది క్షేత్రంలో పోటెత్తిన భక్తులు


భక్తులతో కిటకిటలాడుతున్న మద్దిక్షేత్రం

జంగారెడ్డిగూడెం: గురవాయిగూడెంలోని శ్రీమద్ది ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు, భవానీ దీక్షాదారులు బారులుదీరి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం వరకు దేవస్థానానికి వివిధ సేవలు, విరాళాల ద్వారా రూ.2,70,623 సమకూరినట్లు కార్యనిర్వాహణాధికారిణి ఆర్‌వీ చందన తెలిపారు. భక్తులకు స్వామివారి నిత్యాన్నదాన సత్రం నందు అన్నప్రసాద వితరణ చేశారు.

చోరీ కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: స్థానిక సాయి సౌజన్య నగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన ఘటనపై కేసు నమోదైంది. రైటర్ పి.బాబురావు తెలిపిన వివరాల ప్రకారం పెండ్ర మోహనకృష్ణ ప్రైవేట్ టీచర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన కుటుంబ సభ్యులతో సహా సెప్టెంబర్ 19న బుట్టాయగూడెం మండలం గంగవరం గ్రామం వెళ్లాడు. తిరిగి 29న ఇంటికి వచ్చి చూసే సరికి తలుపులు తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గుర్తించారు. ఇంట్లోకి వెళ్లి చూసే సరికి బీరువాలో ఉంచిన 60 తులాల వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. దీనిపై మంగళవారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు.

ఇందిరమ్మ కాలనీలో చోరీ

భీమవరం: భీమవరం ఇందిరమ్మ కాలనీలోని జరిగిన చోరీపై పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడి బీరువాలోని నగదు, ఆభరణాలను అపహరించారని బాధితురాలు సీహెచ్ నాగలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎం.నాగరాజు తెలిపారు.

ఆంధ్రా ‘పెరటి’లో ఆఫ్రికా ‘రక్కసి’

- పెరటి తోటలను కబళిస్తున్న ఆఫ్రికా నత్తలు
- నిన్న విశాఖ, మన్యం.. నేడు ఉభయగోదావరి జిల్లాలపై దాడి
- బొప్పాయి, జామ, అరటి, కూరగాయల పంటలకు తీవ్ర నష్టం
- వణికిపోతున్న అన్నదాతలు
- ఉప్పు ద్రావణంతో నిర్మూలన చేయాలంటున్న ఉద్యాన శాస్త్రవేత్తలు


బొప్పాయికి పట్టిన ఆఫ్రికా నత్తలు


నల్లజర్ల మండలంలో చెట్లకు పట్టిన ఆఫ్రికా నత్తలు

తాడేపల్లిగూడెం : పెరటి తోటల రైతులను ఆఫ్రికా నత్తలు వణికిస్తున్నాయి. మొన్నటి దాకా విశాఖ, మన్యం జిల్లా రైతులను కలవరానికి గురిచేసి.. తాజాగా ఉభయగోదావరి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలపై దాడి చేశాయి. అయితే వీటి ఉనికిని రైతులు ఐదు నెలల తర్వాత గుర్తించడంతో అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. బొప్పాయి, జామ వంటి పంటలతో పాటు మినుము పైరుకూ తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ పరిస్థితుల్లో ఆఫ్రికా నత్తల సమస్యకు పరిష్కారం చూపేందుకు డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు తోటల బాట పట్టారు.

వందేళ్ల కిందటే వలస

ఆఫ్రికా నత్తలు వందేళ్ల కిందటే భారత దేశానికి వలసొచ్చాయి. తోట పంటలపై వీటి దాడి మూడేళ్లగా మొదలైంది. ముఖ్యంగా తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో ఆఫ్రికా నత్తలు విజృంభించాయి. కేరళ నుంచి వక్క చెట్లను ఇక్కడకు దిగుమతి చేసుకోవడంతో ఆఫ్రికా నత్తల ప్రభావం ఉభయగోదావరి, మన్యం, విశాఖ జిల్లాలకు వ్యాపించింది. పార్వతీపురం, మన్యం జిల్లా, విశాఖ జిల్లా ఎస్.కోట ప్రాంతాల్లో ఆఫ్రికా నత్తల దాడిని రైతులు వెంటనే గుర్తించారు. తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలోని జొన్నాడ ప్రాంతంలోనూ వీటి ఉనికి బయట పడింది. తాజాగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నల్లజర్ల మండలం మినుము తోటపై ఆఫ్రికా నత్తల దాడిని గమనించారు. ఇదే మండలంలోని ఆవపాడులోనూ ఈ నత్తల ఆనవాళ్లను కనిపెట్టారు. ఆఫ్రికా నత్తలు గుడ్లను ఏటా జూలై నుంచి ఫిబ్రవరి వరకు పెడతాయి. ఒక్కో నత్త వంద నుంచి 400 వందల వరకు గుడ్లు పెడుతుంది. నత్త జీవితకాలం ఐదేళ్ల నుంచి ఆరేళ్లు. ఈ సమయంలో ఒక్కో నత్త సుమారు వెయ్యి నుంచి 1,200 పిల్లలకు జన్మనిస్తుంది. తుప్పలు, ఆకుల కింద, వెలుతురు తగలని ప్రాంతాల్లో ఇవి నివశిస్తాయి. బొప్పాయి, అరటి, జామ, కూరగాయలు, మొక్కజొన్న, పత్తి, వక్క, ఆయిల్‌పామ్ పంటలతో పాటుగా నర్సరీలను ఆశ్రయించి రైతులకు అపార నష్టం కలిగిస్తాయి.


నత్తల ప్రభావాన్ని పరిశీలిస్తున్న ఉద్యాన అధికారులు, శాస్త్రవేత్తలు గోవిందరాజులు, చలపతిరావు, విజయలక్ష్మి

ఏమరుపాటుతో భారీ మూల్యం

ఇతర ప్రాంతాల నుంచి మొక్కలను ఇక్కడకు తీసుకొచ్చే సమయంలో వాటిపై నత్తల గుడ్లు, చిన్న చిన్న నత్తలు వంటివి ఉన్నాయేమో రైతులు జాగ్రత్తగా గమనించాలి. వాటిని నిర్మూలించాకే వక్క వంటి మొక్కలను ఇక్కడకు తెచ్చుకోవాలి. ఈ విషయాన్ని విస్మరించామో.. ఆ తర్వాత భారీమూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితులు తలెత్తుతాయి. నీరు ఎక్కువగా ఉండే వరి పంటను ఆఫ్రికా నత్తలు ఆశించవు. వీటికి వాతావరణం అనుకూలించే చిత్తడి నేలల్లోకి వెళ్లి ఉంటాయి.

జాగ్రత్తలిలా..

- పంట తోటలను ఒత్తుగా వేసుకోకూడదు.
- తోటల్లో కలుపు, చెత్త పేరుకుపోకుండా చూసుకోవాలి.
- అంతర సేద్యంపై దృష్టి పెట్టాలి.
- రాత్రులు తోటల్లో నీరు పారించకూడదు.
- తోటల్లో కోళ్లు, బాతులను పెంచుకోవాలి.

వారానికి మూడు రోజులు ఇలా చేస్తే సరి




ఆఫ్రికా నత్తల నివారణకు ఒక కిలో ఉప్పును నాలుగు లీటర్ల నీటిలో కలిపి ఆ నీటిలో గోనె సంచిని తడిపి గట్లపై వేస్తే ఈ సంచులపైకి వెళ్లిన నత్తలు ద్రావణం ఘాటుకు చనిపోతాయి. ఆకర్షక ఎర ఏర్పాటులో భాగంగా 25 కిలోల వరి తవుడుకు వంద గ్రాముల థయోడీకార్బ్ గుళికలు, మూడు కిలోల బెల్లం, వంద గ్రాముల ఆముదాన్ని కలిపి చిన్న ఉండలుగా చేయాలి. ఈ ఉండలను బొప్పాయి, క్యాబేజీ ఆకుల కింద పెట్టాలి. వీటిని తిన్న ఆఫ్రికా నత్తలు చనిపోవడం లేదా నిర్వీర్యం అయిపోతాయి. అనంతరం వీటిని ఉప్పు ద్రావణంలో వేస్తే చనిపోతాయి. ఇలా వారానికి రెండు మూడు రోజుల పాటు 15 రోజుల వరకూ చేయాలి. నత్తలను ఏరివేసే సమయంలో చేతికి గ్లౌజులు ధరించాలి.

– గోవిందరాజులు, విస్తరణ సంచాలకులు, చలపతిరావు, శాస్త్రవేత్త

కొల్లేరు తిప్పలు

- కొల్లేరు ముంపు బారిన పెనుమాకలంక రహదారి
- ప్రమాదం అంచున తప్పని ప్రయాణం


మండవల్లి మండలం పెనుమాకలంక రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తున్న కొల్లేరు వరద నీరు

కైకలూరు: కొల్లేరు చుట్టూ నీరు ఉంది.. తాగడానికి చుక్క నీరు లేదు. పేరుకే పెనుమాకలంక రహదారి.. ఎగువ నుంచి కొల్లేరుకు నీరొస్తే కనిపించకుండా మునిగిపోతుంది. ఈ పరిస్థితులు కొల్లేరు దుర్భర పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. మండవల్లి మండలం పెదఎడ్లగాడి వంతెన నుంచి పెనుమాకలంక, ఇంగిలిపాకలంక వెళ్లే రహదారి అనేక రోజులుగా నీటిలో నానుతూ, ప్రయాణం నరక ప్రాయంగా మారుతోంది. ఇక్కడ రోడ్డుపై బాగా ఎక్కువ నీరు పారితే పడవలపై ప్రజలు వెళుతున్నారు. కాస్త తగ్గితే ద్విచక్రవాహనాలతో పడుతూ లేస్తూ ప్రమాదకరంగా ప్రయాణం సాగిస్తున్నారు. కొత్త వ్యక్తులు ఏ మాత్రం పట్టుతప్పినా కొల్లేరులో మునిగిపోవడం ఖాయం.

కలెక్టర్‌కు ఫిర్యాదు..

పెనుమాకలంక రహదారి నీటిలో మునగడంపై కలెక్టర్ వెట్రిసెల్వికి సోమవారం ప్రజా సమస్యల ఫిర్యాదుల వేదికలో కొందరు ఫిర్యాదులు చేశారు. సుప్రీం కోర్టు అమలు చేస్తున్న 120 జీవో ప్రకారం అక్రమ చేపల సాగు అభయారణ్యంలో నిషిద్ధం. పెనుమాకలంక రహదారిలో అక్రమ చెరువుల సాగు యథేచ్ఛగా సాగుతుంటే పట్టించుకోని ఫారెస్టు అధికారులు ప్రజలకు ఉపయోగపడే రహదారిని నిర్మించడానికి నిబంధనలు అడ్డుచెప్పడం ఏం న్యాయమని ప్రశ్నిస్తున్నారు. ఇటీవల తెలంగాణలో వర్షాలు అధికంగా కురియడంతో వివిధ డ్రెయిన్ల ద్వారా వచ్చిన నీరు ఏలూరు–కైకలూరు రహదారిలో పెదఎడ్లగాడి ద్వారా కిందకు చేరాలి. వంతెన ఖానాల వద్ద గుర్రపుడెక్క పేరుకుపోవడంతో నీరు వెనక్కి మళ్లీ పెనుమాకలంక రహదారిని ముంచేత్తుతుంది. శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

బ్రహ్మాండనాయకుని ఉత్సవాలకు వేళాయె

- రేపటి నుంచి ద్వారకాతిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు
- 6 న రాత్రి తిరుకల్యాణం, 7న రాత్రి రథోత్సవం
- రోజుకో ప్రత్యేక అలంకారంలో దర్శనమివ్వనున్న శ్రీవారు
- ఉత్సవాలు జరిగే రోజుల్లో ఆర్జిత సేవలు రద్దు


శ్రీవారి ఆలయంలో విద్యుద్దీప కాంతులు, అంతర చిత్రంలో శ్రీవారు, అమ్మవార్లు

ద్వారకాతిరుమల: ద్వారకామహర్షి తపోఫలితం.. శ్రీవారి దివ్య క్షేత్రం. ఈ క్షేత్రంలో గురువారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలను నేత్రపర్వంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. 8 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో శ్రీవారు ఉభయ దేవేరులతో కలసి ఉదయం, సాయంత్రం వేళల్లో పలు వాహనాలపై తిరువీధుల్లో విహరిస్తారు. అలాగే ఆలయ ముఖ మండపంలో స్వామివారు రోజుకో విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతంలోని శ్రీహరి కళాతోరణ వేదికపై ఉదయం నుంచి రాత్రి వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. ఉత్సవ ఏర్పాట్లకు సంబంధించిన విద్యుద్దీప అలంకారాలు, ఇతర పనులు తుది దశకు చేరుకున్నాయి.

రెండుసార్లు బ్రహ్మోత్సవాలు

మహర్షి తపస్సుకు మెచ్చిన శ్రీవేంకటేశ్వరస్వామి స్వయంభూ ఈ క్షేత్రంలో పుట్టలో వెలిశారు. అందువల్ల పాదపూజ కోసం పెద్దతిరుపతి నుంచి శ్రీవారిని తెచ్చి స్వయంభూ వెనుక ప్రతిష్టించారు. దాంతో ఒకే అంతరాలయంలో స్వామివారు ద్విమూర్తులుగా కొలువై ఉండటంతో ఏటా వైశాఖ మాసంలో చినవెంకన్నకు, అశ్వయుజ మాసంలో ప్రతిష్ఠ స్వామికి ఇక్కడ బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. తిరుమల తిరుపతి శ్రీవారు ఇక్కడ ఉండటం వల్ల, అక్కడి మొక్కులు ఇక్కడ తీర్చుకునే సాంప్రదాయం ఉంది. కానీ ఇక్కడ మొక్కులు పెద్ద తిరుపతిలో తీర్చకూడదు. పెద్ద వెంకన్న ఉన్న తిరుమల తిరుపతిని పెద్దతిరుపతిగా, చిన్నవెంకన్న ఉన్న ద్వారకాతిరుమలను చిన్నతిరుపతిగా పిలుస్తారు.

ఉత్సవ విశేషాలు ఇవీ..

- 2 న ఉదయం 9.30 గంటలకు శ్రీవారిని పెండ్లి కుమారునిగా, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా చేస్తారు. ఆ రోజు రాత్రి 7 గంటలకు గజవాహనంపై స్వామివారి గ్రామోత్సవం.
- 3 న రాత్రి 9 గంటలకు ధ్వజారోహణ, అనంతరం హంసవాహనంపై స్వామివారి గ్రామోత్సవం.
- 4 న ఉదయం 7 గంటలకు సూర్యప్రభ వాహనంపై, రాత్రి 7 గంటలకు చంద్రప్రభ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం.
- 5 న ఉదయం 7 గంటలకు హనుమద్వాహనంపై స్వామివారి గ్రామోత్సవం, రాత్రి 7 గంటలకు ఎదుర్కోలు ఉత్సవం, అనంతరం వెండి శేష వాహనంపై గ్రామోత్సవం.
- 6 న ఉదయం 7 గంటలకు సింహ వాహనంపై శ్రీవారి గ్రామోత్సవం, రాత్రి 8 గంటల నుంచి శ్రీ స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం, అనంతరం వెండి గరుడ వాహనంపై గ్రామోత్సవం.
- 7 న రాత్రి 8 గంటల నుంచి రథోత్సవం.
- 8 న ఉదయం 10.30 గంటలకు చక్రస్నానం, రాత్రి 9 గంటలకు ధ్వజావరోహణ, అనంతరం అశ్వ వాహనంపై గ్రామోత్సవం.
- 9 న ఉదయం 9 గంటలకు చూర్ణోత్సవం, వసంతోత్సవం, రాత్రి 7 గంటలకు ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, పవళింపుసేవ, శ్రీపుష్పయాగం కార్యక్రమాలు జరుగుతాయి. వీటితో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

ప్రత్యేక అలంకారాలు ఇలా..

- 2న మహావిష్ణువు
- 3న మురళీకృష్ణ
- 4న సరస్వతి
- 5న భూ వరాహ స్వామి
- 6న మోహిని
- 7న రాజమన్నార్
- 8న వైకుంఠ నారాయణుడు
- 9న శయన మహావిష్ణువు

క్షేత్రానికి చేరుకునేదిలా..

దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులు రైల్వే మార్గంగుండా ద్వారకాతిరుమలకు 17 కిలో మీటర్ల దూరంలో ఉన్న భీమడోలు రైల్వేస్టేషన్‌కు చేరుకొని అక్కడినుంచి ఆర్టీసీ బస్సులు, ఆటోలు ద్వారా క్షేత్రానికి చేరుకోవాలి. ఏలూరు, నరసాపురం, తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెం, రాజమండ్రి ప్రాంతాల బస్సుల ద్వారా నేరుగా క్షేత్రానికి చేరుకోవచ్చు.

పెరుగుతున్న భక్తుల తాకిడి

దినదినాభివృద్ధి చెందుతున్న ఈ క్షేత్రాన్ని సందర్శించే భక్తుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలన్న లక్ష్యంతో అధికారులు పలు అభివృద్ధి పనులు చేపట్టారు. అందులో భాగంగా కోట్లాది రూపాయల వ్యయంతో జరుగుతున్న అనివేటి మండప విస్తరణ, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఇవి అందుబాటులోకి వస్తే భక్తులకు మరిన్ని సౌకర్యాలు సమకూరుతాయి. ఈ క్షేత్రంలో 40 అడుగులకు పైగా ఉన్న గరుత్మంతుడు, అభయాంజనేయుడు, అన్నమాచార్యుని విగ్రహాలు భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.


గజ వాహనాన్ని ముస్తాబు చేస్తున్న సిబ్బంది

భక్తులు తరలిరావాలి



శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. 8 రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలను వీక్షించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలి. సాధారణ భక్తులకు పెద్దపీట వేస్తాం. 6న స్వామివారి కల్యాణం, 7న రథోత్సవాన్ని నిర్వహిస్తాం. ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 2 నుంచి 9 వరకు ఆలయంలో నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నాం. భక్తులు గమనించాలి.

– ఎన్‌వీఎస్ఎన్ మూర్తి, శ్రీవారి దేవస్థానం ఈఓ

సోషల్ మీడియాలో దుష్ప్రచారంపై ఫిర్యాదు


డీఎస్పీ శ్రావణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న సుదర్శనం, ఎస్సీ నేతలు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా కైకలూరు దానగూడెం దళితులకు, మరో సామాజికవర్గానికి మధ్య వినాయక నిమజ్జనం ఊరేగింపులో చోటుచేసుకున్న ఘర్షణపై సోషల్ మీడియాలో తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏపీ మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బేతాళ సుదర్శనం ఏలూరు డీఎస్పీ డీ.శ్రావణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. కొందరు యూట్యూబర్లు, ఇన్‌ఫ్లూయన్సర్లు ఇష్టారాజ్యంగా వీడియోలు, రీల్స్ చేస్తూ రెండు సామాజికవర్గాల మధ్య విభేధాలు, విద్వేషాలు రగిలించేలా సోషల్ మీడియాలో ప్రచారం చేయటాన్ని ఆయన తప్పుబట్టారు. ఎస్సీ, ఎస్టీలను అవమానించేలా, రెచ్చగొట్టేలా, వారి మనోభావాలను కించపరిచేలా సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం మేరకు కఠిన చర్యలు తీసుకోవచ్చని సుప్రీంకోర్టు తీర్పును ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయా యూట్యూబర్ల వివరాలను ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్‌కు అందజేశారు. ఫిర్యాదు చేసిన వారిలో ఏపీ మాల ఉద్యోగుల సంఘం ప్రతినిధులు బేతాళ నాగరాజు, టీఎన్‌డీవీ ప్రసాద్, ములగల బెన్హర్, బంటుమిల్లి కెనడీ, దండబత్తుల రవికుమార్ ఉన్నారు.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్ట్

ఏలూరు టౌన్: గంజాయి కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఏలూరు వన్‌టౌన్ సీఐ జీ.సత్యనారాయణ తెలిపారు. ఏలూరు రూరల్ పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి ఎస్సై బి.నాగబాబు తన సిబ్బందితో సెప్టెంబర్ 29న సాయంత్రం 4.30గంటల సమయంలో ఏలూరు తంగెళ్ళమూడి ప్రాంతంలో వాహన తనిఖీలు నిర్వహించగా, ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని తనిఖీ చేయగా 2.396 కిలోల గంజాయి లభించడంతో అరెస్ట్ చేసినట్లు చెప్పారు. నిందితులు ఏలూరు 29వ డివిజన్ తాపీమేస్త్రీ కాలనీకి చెందిన దుడ్డె ప్రశాంత్‌కుమార్, బీడీ కాలనీ ద్వారకా నగర్‌కు చెందిన సిద్ధాంతపు రాములపై కేసు నమోదు చేసి, న్యాయస్థానం ముందు హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించారని తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఆత్మహత్య

ఆకివీడు: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై హనుమంతు నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక శ్రీరామపురంకు చెందిన పాలకుర్తి సంతోష్ కుమార్ (36) అమెజాన్ కంపెనీలో సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేసేవాడు. ఇటీవల ఉద్యోగం నుంచి తొలగించడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈఎంఐ బకాయిలు కట్టలేక మనస్తాపంతో మంగళవారం తెల్లవారు జామున ఇంటిలోని వరండాలోని ఇనుప రాడ్డుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని భార్య కీర్తన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

హత్యగా మారిన మిస్సింగ్ కేసు?

తణుకు అర్బన్: గత నాలుగు రోజులుగా తణుకులో సంచలనం రేకెత్తించిన యువకుడి అదృశ్యం కేసు కాస్త హత్య కేసుగా మలుపు తిరిగింది. తాడేపల్లిగూడెంకు చెందిన మడుగుల సురేష్ (25) ఆచూకీ కోసం మంగళవారం పోలీసు అధికారులు గోస్తనీ కాలువ, చించినాడ బ్రిడ్జి ప్రాంతాల్లో చేసిన గాలింపు చర్యలు చేపట్టారు. తాడేపల్లిగూడెం డీఎస్పీ డి.విశ్వనాథ్ గాలింపు చర్యలను పరిశీలించారు. అజ్ఞాతంలో ఉన్న న్యాయవాది తిర్రే సత్యనారాయణరాజు, నలుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని వారిచ్చిన సమాచారంతోనే గాలింపు చర్యలు చేపట్టారంటూ గుప్పుమంది. అయితే సురేష్, న్యాయవాది భార్య శిరీషతో అత్యంత సన్నిహితంగా ఉండేవాడని ఇటీవల గౌరీపట్నం కూడా కలిసివెళ్లారని తెలుస్తోంది. దీంతో వివాహేతర సంబంధం కారణంగానే హత్య జరిగిందా అనేది చర్చనీయాంశంగా మారింది. ఇందుకు నిదర్శనంగా సురేష్, శిరీష కలిసి ఉన్న ఫొటోలను సురేష్ కుటుంబ సభ్యులు బయటకు విడుదల చేశారు.


తణుకు గోస్తనీ కాలువలో యువకుడి జాడ కోసం గాలిస్తున్న దృశ్యం

25న వెలుగులోకి మిస్సింగ్..

ఈనెల 23వ తేదీన సురేష్ తణుకు వచ్చి మరలా తాడేపల్లిగూడెం రాలేదని అతడి సోదరి ప్రశాంతి ఈనెల 25న తణుకు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన నేపథ్యంలో వెలుగులోకి వచ్చిన మిస్సింగ్ వ్యవహారం తణుకులో సంచలనం రేకెత్తించింది. న్యాయవాది తిర్రే సత్యనారాయణరాజు భార్య శిరీషతో సురేష్ సన్నిహితంగా ఉంటాడని ఆయనపైనే అనుమానంగా ఉందంటూ చేసిన ఫిర్యాదుతో పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేశారు. అయితే న్యాయవాదితోపాటు తణుకుకు చెందిన మరో నలుగురు వ్యక్తులు అజ్ఞాతంలోకి వెళ్లడంతో ఆరోపణలకు బలం చేకూరింది. పట్టణ సీఐ ఎన్.కొండయ్య ప్రత్యేక బృందాన్ని నియమించి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. మంగళవారం ఉదయం నిందితులను తణుకు తీసుకువచ్చి విచారిస్తున్నట్లుగా సమాచారం.

స్టేషన్ వద్ద ఉద్రిక్తత...

సురేష్ అదృశ్యంపై ఫిర్యాదు చేసి వారం రోజులు గడిచినా ఇంతవరకు పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదంటూ తాడేపల్లిగూడెంకు చెందిన బాధితవర్గాలు తణుకు పట్టణ పోలీస్‌స్టేషన్ ముందు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఒక దశలో ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. సీఐ కొండయ్య బయటకు వచ్చి విచారణకు సహకరించాలని విజ్ఞప్తి చేయడంతో గొడవ సద్దుమణిగింది.

పోలీసులను పక్కదారి పట్టిస్తున్న నిందితులు!

పోలీసులను నిందితులు పక్కదారి పట్టిస్తున్నారని సురేష్ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మంగళవారం ఉదయం డీఎస్పీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో పోలీసులు ఈతగాళ్లు, బాధిత వర్గాల సాయంతో తణుకు గోస్తనీ కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. తీరా మధ్యాహ్నం మరలా చించినాడ బ్రిడ్జి ప్రాంతంలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. దీంతో నిందితులు ముందుగానే పక్కా ప్రణాళిక వేసుకుని పోలీసులను పక్కదారి పట్టిస్తున్నారని అంటున్నారు. ఈనెల 23న కొందరు వ్యక్తులు సురేష్‌ను తణుకులోని ఒక శ్మశానవాటికలో గట్టిగా కొట్టినట్లుగా తెలిసిందని బాధితవర్గాలు చెబుతున్నారు.

మూడో పంటకు సిద్ధమవుతున్న రైతులు



తాడేపల్లిగూడెం మండలం ఎల్.అగ్రహారం గ్రామంలో దుక్కి దున్ని సిద్ధం చేసిన దృశ్యం



పుల్లాయగూడెంలో మొక్క వచ్చిన మినుము పంట

దుక్కి దున్ని మినుము విత్తనాలు సాగు

తాడేపల్లిగూడెం రూరల్: ఖరీఫ్ సాగు తాడేపల్లి గూడెం మండలం మెట్ట ప్రాంత గ్రామాల్లో దాదాపు పూర్తి కావచ్చింది. దీంతో కడియద్ద, నీలాద్రిపురం, కొమ్ముగూడెం, పట్టింపాలెం, వీరంపాలెం, పుల్లాయగూడెం, ఎల్.అగ్రహారం, అప్పారావుపేట, మోదుగగుంట, కృష్ణాయపాలెం తదితర గ్రామాల్లో మూడో పంటగా మినుము సాగు చేసేందుకు రైతాంగం సన్నద్ధమవుతుంది. ఇప్పటికే చాలా గ్రామాల్లో మినుము విత్తనాన్ని చల్లుకున్నారు. పంట మార్పిడి విధానం ద్వారా రాబోయే పంటకు మేలు చేస్తుందన్న అధికారుల సూచనలతో రైతులు మినుము పంటను చేపట్టారు. ప్రస్తుతం వేసిన మినుము పంట నవంబరు, డిసెంబరు నెలలకు పంట చేతికొచ్చే అవకాశం ఉంది. దాదాపు నాలుగు వేల నుంచి ఐదు వేల ఎకరాల్లో ప్రత్యామ్నాయ పంటగా మినుము సాగు చేస్తారని అంచనా. ఎల్‌బీజీ 884 రకం మినుము విత్తనాన్ని వేశారు. 75 నుంచి 80 రోజుల వ్యవధిలో పంట చేతికొచ్చే అవకాశం ఉంది. తెగుళ్లను సైతం తట్టుకునే లక్షణం ఉండటంతో వ్యవసాయాధికారులు సైతం ఈ విత్తనాన్ని సూచించారు. కొత్తగా ఈ విత్తనాన్ని అభివృద్ధి చేసినట్లు శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ప్రయోగాత్మకంగా రైతాంగానికి ఈ విత్తనాన్ని ఇటీవల ఉచితంగా సరఫరా చేశారు. ఎకరాకు 10 టన్నుల వరకు దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు సూచించారు. ఖరీఫ్‌లో వర్షాల కారణంగా దిగుబడులు ఆశాజనకంగా రాని పరిస్థితి. దీంతో కౌలు రైతాంగానికి మూడో పంటగా ఆరుతడి పంటలైన మినుము, పెసర వంటి పంటలు కొంత ఉపశమనాన్ని ఇస్తాయి. అంతే కాకుండా కౌలు రైతాంగానికి సైతం ఈ పంట ద్వారా నాలుగు డబ్బులు కనిపించే అవకాశం ఉంది. దీంతో కౌలు రైతాంగం ప్రధానంగా ఈ పంటల సాగు చేపడతారు.

గాలికుంటు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



జువ్వలపాలెంలో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి భార్గవిసత్య

కాళ్ల: పాడి రైతులు తమ పశువులకు సోకే గాలికుంటు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి కె.భార్గవి సత్య తెలిపారు. కాళ్ల మండలం జువ్వలపాలెం గ్రామంలో మంగళవారం గాలికుంటు వ్యాధి నివారణా టీకాల కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా పలు పాడిపశువులకు ఆమె టీకాలువేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాలికుంటువ్యాధి వైరస్‌వల్ల వస్తుందని తెలిపారు. ఈ వ్యాధి సోకిన పశువులకు జ్వరం, నోటి నుంచి చొంగరావడం, కాలిగిట్టలకు పుండ్లు, నీరసించి పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. అదేవిధంగా పాల ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా తగ్గిపోతుందన్నారు. సకాలంలో వైద్యం అందించకపోతే వ్యాధి తీవ్రతపెరిగి పశువుచనిపోయే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అక్టోబర్ 15 వరకు ప్రతి గ్రామంలోనూ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరుగుతుందని వీటిని రైతులందరూ వినియోగించుకోవాలని ఆమె కోరారు.

క్లుప్తంగా

ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన కారుమూరి



హైదరాబాద్‌లో ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్ : రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. కూటమి అక్రమ కేసులో ఇటీవల రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి బెయిల్‌పై వచ్చిన మిథున్‌రెడ్డిని హైదరాబాద్‌లో మంగళవారం కలిసి పలు విషయాలపై చర్చించారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు మేలు



జీఎస్టీ సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎం.వెంకటేష్

తాడేపల్లిగూడెం రూరల్: జీఎస్టీని తగ్గించడం ద్వారా ప్రజలకు వివిధరకాల వస్తువుల కొనుగోలుపై లబ్ధి చేకూరుతుందని ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎం.వెంకటేష్ అన్నారు. మంగళవారం మండలంలోని నవాబుపాలెంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకటేష్ మాట్లాడుతూ గతంలో నాలుగు శ్లాబ్‌లుగా ఉండే జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం రెండు శ్లాబ్‌లకు కుదించిందన్నారు. తద్వారా వస్తువుల కొనుగోలుపై భారీ తగ్గింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ



పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

యలమంచిలి: దసరా సందర్భంగా పాలకొల్లులో నివాసం ఉంటున్న పెనుగొండ సూర్యనారాయణ, నాగ తులసి దంపతులు తమ స్వగ్రామమైన బూరుగుపల్లి గ్రామంలో మంగళవారం 50 మంది నిరుపేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి 10 కిలోల బియ్యం, కిలో కందిపప్పు అందజేశారు. కార్యక్రమంలో శిరిగినీడి సత్యనారాయణ-సంగీత, డాక్టర్ గునిశెట్టి కృష్ణ, డాక్టర్ రాజిత, కోటిపల్లి మణికంఠ, సాయి హరిత తదితరులు పాల్గొన్నారు.

మందాలమ్మ సేవలో 'కోర్టు' నటుడు



భక్తి గీత మాలికను ఆవిష్కరిస్తున్న కోర్టు నటుడు భోగిరెడ్డి శ్రీనివాస్

పెనుగొండ: వడలి గ్రామ దేవత మందాలమ్మ ఆశీస్సులతో ఎందరో ఉన్నత శిఖరాలకు చేరుకొన్నారని వడలి గ్రామ వాసి, సినీ నటుడు భోగిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. శరన్నవరాత్రులు ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వడలిలో మందాలమ్మ ఆలయ ప్రాంగణంలో మందాలమ్మ భక్తి గీత మాలిక యూట్యూబ్ ఛానల్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప్పలపాటి శ్రీను, పేరిచర్ల నాగశ్రీను, అత్యం శ్రీనివాసు, గణపతినీడి బుల్లియ్య, చుక్కా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతూనే పింఛన్ల పంపిణీ

యలమంచిలి: సచివాలయ ఉద్యోగులు నిరసన తెలుపుతూనే బుధవారం అక్టోబర్ నెల పింఛన్లు పంపిణీ చేస్తారని ఉద్యోగుల సంఘం నాయకుడు షేక్ ఉమర్ ఆలీషా తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం వృద్ధులు, వితంతు వులు, వికలాంగులను కష్టపెట్టకూడదని రాష్ట్ర యూనియన్ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని సచివాలయ ఉద్యోగులంతా బాధ్యతగా తీసుకుని పాటించాలని ఆయన కోరారు.

వడ్డీ రాయితీ సొమ్ము అందజేత

పెనుగొండ: ఇలపర్రు సొసైటీలో రైతులకు అవసరమైన అన్ని సేవలు అందుబాటులో ఉంచినట్లు ఇలపర్రు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘ చైర్మన్ కేతా సత్తిబాబు తెలిపారు. మంగళవారం ఇలపర్రు సొసైటీలో రైతులకు మూడు శాతం వడ్డీ రాయితీ సొమ్ము 2022-23 సంవత్సరానికి గాను 165 మంది రైతులకు రూ.2,98,216ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు చేకూరి నరసింహరాజు, నల్లి త్రిమూర్తులు పాల్గొన్నారు.

నవాబుపాలెంలో వ్యవసాయ కార్మిక సంఘ మహాసభలు



నవాబుపాలెంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభలో మాట్లాడుతున్న వక్తలు

తాడేపల్లిగూడెం రూరల్: శ్రామికుల తవ్వ కొలతలతో ఎలా దోపిడీని గ్రహించి తన ఇంట్లోనే వ్యవసాయ కార్మిక సంఘాన్ని స్థాపించిన వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నవాబుపాలెం అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో వ్యవసాయ కార్మిక సంఘం ఐదవ మండల మహాసభ నిర్వహించారు. తొలుత సంఘ పతాకాన్ని సీనియర్ నాయకుడు కొండపల్లి గణేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కండెల్లి సోమరాజు మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం చేసిన పోరాటాల ఫలితంగానే ఉపాధి హామీ పథకం బకాయిలు విడుదలయ్యాయన్నారు. సంఘ మండల కార్యదర్శి కండెల్లి రమేష్‌బాబు మాట్లాడారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మాగంటి వెంకటరమణ, ఉపాధ్యక్షుడిగా పీలా గాదినాయుడు, కార్యదర్శిగా కండెల్లి రమేష్‌బాబు, సహాయ కార్యదర్శిగా ఈదా పెద్దింట్లు, కమిటీ సభ్యులుగా కండెల్లి బాబూరావు, గజ్జరపు వెంకటేశ్వరరావు, పాలుపూరి శ్రీనివాస్, గోపాల వెంకట్రావు, నూతంగి సూర్యారావులను ఎన్నుకున్నారు.

వేడుకగా కన్యల పూజ



నగరేశ్వర స్వామి ఆలయంలో కన్యల పూజ నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా పెనుగొండలో శ్రీనగరేశ్వర మహిషాసురమర్దని వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో 102 కన్యల పూజ భక్తి శ్రద్ధలో నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో నగరేశ్వర స్వామి ఏకాదశ రుద్రాభిషేకాలు, మహిషాసురమర్దని, వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవార్లకు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగాణంలో వేద పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య 102 కన్యల పూజ నిర్వహించారు. పెనుగొండ పరిసర ప్రాంతాలకు చెందిన వందలాది మంది చిన్నారులు 102 కన్యల పూజలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు అనంతరం నిత్యాన్నదాన సత్రంలో భక్తులకు అన్న ప్రసాదం అందించారు.

పార్టీ శ్రేణులకు అండగా డిజిటల్ బుక్



డిజిటల్ బుక్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : పార్టీ శ్రేణులకు అండగా ఉండేందుకు జగనన్న డిజిటల్ బుక్ ప్రారంభించారని మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. కూటమి ప్రభుత్వం విధానాల కారణంగా ఎవరికైనా ఇబ్బందులు ఎదురైతే వాటిని డిజిటల్ బుక్‌లో నమోదు చేసుకోవాలని, పార్టీ తప్పకుండా అండగా నిలుస్తోందని స్పష్టం చేశారు. మంగళవారం డిజిటల్ బుక్ పోస్టర్లను ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా వారిపై కూటమి ప్రభుత్వం అక్రమంగా పోలీసు కేసులు నమోదు చేయిస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వ దుర్మార్గానికి బలైన వారు ఈ డిజిటల్ బుక్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని క్యూఆర్‌కోడ్ ద్వారా తమకు జరిగిన అన్యాయాన్ని తెలియజేయవచ్చునని తెలిపారు. దుర్మార్గంగా కేసులు నమోదు చేసిన అధికారులపై అధికారం చేపట్టిన తక్షణం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుంటుందన్నారు. అధికారులు రిటైర్ అయినా, లేక విధుల్లో ఉన్నా ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ డిజిటల్ బుక్ పార్టీ నాయకులకు, కర్యకర్తలకు, సోషల్ మీడియా వారికి అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరి భాస్కరరెడ్డి, రెడ్డి సూరిబాబు, బొద్దాని శ్రీనివాస్, కొలుకులూరి ధర్మరాజు, ముప్పిడి సంపత్‌కుమార్, జడ్డు హరిబాబు, తమ్మిశెట్టి రఘు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అల్పాహారం పంపిణీ

యలమంచిలి: మండలంలోని గుంపర్రు శ్రీ వల్లీ దేవ సేనా సమేత సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయంలో ప్రతి మంగళవారం ప్రత్యేకపూజలు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ప్రముఖ ఆధ్యాత్మిక గురువు బ్రహ్మశ్రీ మానేపల్లి రామ లింగేశ్వరరావు ఈ విజయ దశమినుంచి ఆలయాని కివచ్చే భక్తులకు మధ్యాహ్న సమయంలో అల్పాహారం అందివ్వాలని సూచించారు. ఆయన సూచన మేరకు గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎంఈఓ కెవిఎస్ సత్యనారాయణమూర్తి మంగళవారం భక్తులకు అల్పాహారం అందజేశారు.

5న ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా అధ్యక్షుడు మూర్తి

తణుకు అర్బన్: ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా మహా సభలు ఈనెె 5వ తేదీన తణుకులో నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు డీవీఎస్ మూర్తి పేర్కొన్నారు. తణుకు డిపోలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మహసభల్లో కార్మికుల సమస్యలపై చర్చిస్తామని 12వ వేతన కమిటీ, ఐఆర్ ప్రకటించలేదని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు, డీఏ అలవెన్స్ వేయలేదని, ఐదు సంవత్సరాలు లీవ్ అండ్ ఎన్‌కేష్‌మెంట్స్ పెండింగ్‌లో పెట్టారనే సమస్యలపై చర్చించనున్నట్లు చెప్పారు. స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఏర్పడి 46 సంవత్సరాలు నుంచి కార్మికులు సమస్యలపైన, రవాణా రంగం విస్తరణ కోసం కృషి చేస్తుందన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను మహాసభలో చర్చిస్తామని ఆర్టీసీకి చెందిన విలువైన స్థలాలను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని దీనిపై చర్చిస్తామని, విద్యుత్ బస్సులు, బస్సు స్టేషన్లో ప్రైవేటీకరణ అనేక అంశాలు పై చర్చిస్తూ రాబోయే కాలంలో కర్తవ్యాలను మహాసభలో రూపొందిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ తణుకు డిపో ఎస్‌డబ్ల్యూఎఫ్ అధ్యక్షులు కె.నూకరాజు, కార్యదర్శి ఎన్.శ్రీనివాసు, కామన మునిస్వామి పాల్గొన్నారు.

మహిళలకు వసుధ ఫౌండేషన్ చేయూత



భీమవరం పట్టణం దుర్గాపురంలో కుట్టు శిక్షణలో మెలకువలు తెలుసుకుంటున్న మహిళలు

భీమవరం: వసుధ ఫౌండేషన్ సహకారంతో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎస్సీ మహిళలకు ఉచితంగా కుట్టు, శారీ పెయింటింగ్ వంటివాటిలో ఇస్తున్న శిక్షణ మహిళలకు ఎంతగానో దోహదపడుతోంది. స్వశక్తిపై ఎదగాలనే కోరిక, కొత్తగా నేర్చుకోవాలని ఉత్సాహం ఉన్న మహిళలకు వసుధ చేయూతనిస్తోంది. దీనిలో భాగంగా భీమవరం పట్టంలోని దుర్గాపురం అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవా కేంద్ర భవనంలో గత రెండున్నర నెలలుగా సుమారు 30 మంది ఎస్సీ వర్గానికి చెందిన మహిళలకు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఆరుగురు మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్స్ పంపిణీ చేయనున్నట్లు వసుధ పౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు చెప్పారు.



తాడేపల్లిగూడెం(టీటీసీ): వనదుర్గాదేవిగా బలుసులమ



అత్తిలి: ఆరవల్లిలో కనకదుర్గాదేవి అలంకరణలో అమ్మవారు



తాడేపల్లిగూడెం(టీటీసీ): దుర్గాదేవిగా మహంకాళమ్మ



తాడేపల్లిగూడెం(టీటీసీ): రాజరాజేశ్వరీ దేవి అలంకరణలో

దుర్గమ్మ తల్లీ.. కాపాడమ్మా

తాడేపల్లిగూడెం (టీటీసీ): పట్టణంలో దేవి నవరాత్రి మహోత్సవాలు సందడిగా జరుగుతున్నాయి. 9వ రోజైన మంగళవారం పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారిని వనదుర్గాదేవిగా విశేష అలంకరణ గావించారు. వాసవి కన్యక పరమేశ్వరీ ఆలయం అమ్మవారిని కనకదుర్గాదేవిగా విశేష అలంకరణ గావించారు. శంకరమఠంలోని సర్వమంగళమ్మవారిని కనకదుర్గాదేవిగా విశేష అలంకరణ చేశారు. అష్టోత్తర శత సువాసిని పూజలు జరిగాయి. మహంకాళమ్మ అమ్మవారిని దుర్గాదేవిగా విశేష అలంకరణచేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకున్నారు. స్థానిక బ్రహ్మానందరెడ్డి మార్కెట్లో పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో అమ్మవారిని రాజరాజేశ్వరీ దేవిగా విశేషంగా అలంకరించారు.

అమ్మవార్లకు విశేష పూజలు

అత్తిలి: శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా అత్తిలి మండలం ఆరవల్లి గ్రామంలో కనకదుర్గమ్మ అమ్మవారిని కనకదుర్గాదేవిగా అలంకరించారు. గ్రామానికి చెందిన సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులచే అమ్మవారిని అలంకరణ చేసి, ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం భవానీ భక్తులచే జ్యోతులతో ఊరేగింపు ఉత్సవాన్ని జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వెలగల అమ్మిరెడ్డి, తేతలి సోమిరెడ్డి, కోనాల నాగ తాతారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అత్తిలి మండలంకె సముద్రపుగట్టు గ్రామంలో గల శ్రీదుర్గా భవానీ ఆలయంలో అమ్మవారికి సామూహిక లక్ష కుంకుమ పూజలు జరిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు.

కనకదుర్గాదేవిగా దర్శనమిచ్చిన ముత్యాలమ్మ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలంబాపురం శ్రీముత్యాలమ్మ వారిని శ్రీదేవీ శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా మంగళవారం కనకదుర్గాదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అన్నంనేడి భవానీరాజు దంపతులు సహస్ర కుంకుమార్చన, గంగుల వెంకటేశ్వరరావు దంపతులు చండీ పారాయణ, చండీ హోమం నిర్వహించారు. ఆలయ ఈవో పి.హరే రాంప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. వీరంపాలెం శ్రీబాలాత్రిపుర సుందరీదేవిని సిద్ధిధాత్రిగా అలంకరించారు. పీఠం ప్రాంగణంలో హైకోర్టు న్యాయమూర్తి శేషసాయి, ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ కార్యదర్శి జయలక్ష్మి -గోపీనాథ్ దంపతులు చండీహోమం నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకులు గరిమెళ్ళ వెంకటరమణ శాస్త్రి మాట్లాడుతూ సిద్ధిధాత్రిదేవి నవరాత్రులు వివిధ రూపాల్లో పూజలందుకున్న అనంతరం అమ్మ అనుగ్రహించే రూపమని పేర్కొన్నారు. బుధవారం రాజరాజేశ్వరి దేవీగా భక్తులకు బాలాత్రిపుర సుందరీదేవి దర్శనమిస్తారన్నారు. భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించి, తరలించాలని కోరారు.

దుర్గాదేవి అలంకరణలో అమ్మవార్లు

పెంటపాడు: మండలంలోని పలు దుర్గాదేవి ఆలయాలలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. కుంకుమ పూజలు జరిగాయి. దర్శిపర్రులో పార్వతి బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సామూహిక కుంకుమపూజలు ఘనంగా జరిగాయి. ప్రత్తిపాడు కాగులంపాడు రోడ్డులోని అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. వెజ్జుసత్యవరప్రసాద్ ఆధ్వర్యంలో రాత్రి వెంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు. ప్రత్తిపాడు వై. జంక్షన్ అమ్మవారి ఆలయంలో భజనలు చేశారు. కె. పెంటపాడు, మౌంజీపాడు ఆలయాలలో అమ్మవార్లను విశేషంగా అలంకరించారు.



తాడేపల్లిగూడెం రూరల్: సిద్ధిధాత్రిదేవిగా బాలాత్రిపుర సుందరీదేవి



తాడేపల్లిగూడెం(టీటీసీ): వాసవి అమ్మవారు



తాడేపల్లిగూడెం రూరల్: ముత్యాలమ్మ వారిని కనకదుర్గాదేవిగా అలంకరించిన దృశ్యం



తాడేపల్లిగూడెం(టీటీసీ): సర్వమంగళమ్మ



తాడేపల్లిగూడెం రూరల్: పూజల్లో పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి శేషసాయి



పెంటపాడు: దర్శిపర్రులో కుంకుమ పూజలు పాల్గొన్న మహిళలు